పత్రికాప్రకటన కాకినాడ, 26.2.2019

ఎన్నికల కమీషన్ జారీ చేసిన తాజా ఉత్తర్వుల మేరకు ఎన్నికలలో పోటీకి నామినేషన్ ధాఖలు చేసిన అభ్యర్థులు, వారికి టికెట్ ఇచ్చిన రాజకీయ పార్టీలు అభ్యర్థుల నేర చరిత, పెండింగ్ క్రిమినల్ కేసులపై నిర్థేశిత ఫారమ్-సి1, ఫారమ్-సి2లలో డిక్లరేషన్‌లను అత్యధిక సర్యులేషన్ కలిగిన పత్రికలు, టీవి ఛానళ్లలలో ప్రకటించాలని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా తెలిపారు.

మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశ నిర్వహించి తూర్పు పశ్చిమ గోదావరి పట్టభద్రుల శాసన మండలి నియోజక వర్గ ఎన్నికల షెడ్యూలు, ఏర్పాట్లు, ఎన్నికల కమీషన్ అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు జారీ చేసిన తాజా ఉత్తర్వులను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు పశ్చిమ గోదావరి పట్టభద్రుల శాసన మండలి నియోజక వర్గ ఎన్నికలకు ఈ నెల 25వ తేదీన నోటిఫికేషన్ జారీ చేశామని, ఎన్నికల కమీషన్ ప్రకటన జారీ అయిన 24వ తేదీ రాత్రి 7 గం.ల నుండి నియోజక వర్గ పరిధిలో ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని తెలిపారు. ఈ నెల 20వ తేదీన ప్రచురించిన తుది జాబితా ప్రకారం నియోజక వర్గంలో 2,90,780 మంది ఓటర్లు నమోదైయ్యారని, నిరంతర ప్రక్రియ క్రింద 23వ తేదీ వరకూ అందిన మరో 2,161 ధరఖాస్తు అందగా వీటిని అర్హులైన వారిని నమోదు చేసి జాబితాలో చేరుస్తామని తెలిపారు. నియోజక వర్గం పరిధిలోని ఉభయ గోదావరి జిల్లాలో మొత్తం 299 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి 45 జోన్లు, 51 రూట్లుగా విభజించామన్నారు. పోలింగ్ బ్యాలెట్ విధానంలో జరుగుతుందని, డివిజన్ కేంద్రాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేసామని తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల ఆవరణలో ఏర్పాటు చేశామన్నారు.

ఎన్నికల నిర్వహణకు సంబంధించి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఫిర్యాదులను ప్రజలు, పార్టీలు 1800-425-3077 టోల్ ఫ్రీ నెంబరు, 0884-2379150 లాండ్‌లైన్ నెంబర్లకు తెలియజేయాలని కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అంశాలను వివరించి, వీటి అమలు పర్యవేక్షణకు తూర్పు గోదావరి జిల్లాలో 74, పశ్చిమ గోదావరి జిల్లాలో 48 యంసిసి టీములు ఏర్పాటైయ్యాయన్నారు.

ఎన్నికల కమీషన్ జారీ చేసిన ఉత్తర్వులను వివరిస్తూ, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థి విధిగా రివైజ్డ్ ఫారమ్-26 నమూనాలో అఫిడవిట్ సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే ఏదేని రాజకీయ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులు తమకు సంబంధించిన పెండింగ్ క్రిమినల్ కేసుల సమాచారాన్ని విధిగా పార్టీకి తెలియజేయాలన్నారు. సదరు రాజకీయ పార్టీ తమ అభ్యర్థి నేర చరిత సమాచారాన్ని పార్టీ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా ప్రదర్శించాల్సి ఉందని తెలిపారు. పార్టీ టికెట్‌పై పోటీ చేసే అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసిన తేదీ నుండి పోలింగ్ ముగింపుకు రెండు రోజుల ముందు తేదీ లోపు కాలంలో కనీసం మూడు పర్యాయాలు అభ్యర్థులు ఎన్నికల కమీషన్ నిర్థేశించిన ఫార్మాట్ - సి1లో అత్యధిక సర్క్యులేషన్ కలిగిన దిన పత్రికలలోను, టివి ఛానళ్లలోను ప్రకటించాలని, అలాగే అతనికి టికెట్ ఇచ్చిన పార్టీ ఫార్మాట్ - సి2 లో ఈ ప్రకటనలు పత్రికలు, టీవీలో ప్రకటించాలని తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల సూచనలను కోరగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరిగే 22వ తేదీని ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ప్రభుత్వ శెలవుగా ప్రకటించాలని సిపియం పార్టీ ప్రతినిధి సిహెచ్.అజయ్‌కుమార్ కోరారు. అలాగే రాజకీయ పార్టీలు అనుమతి లేకుండా జరుపుతున్న ఆడియో-విజువల్ పబ్లిసిటీ పై టిడిపి పార్టీ ఫిర్యాదును ఆపార్టీ ప్రతినిధి వి.సూరిబాబు జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. పార్టీల సూచనలు, ఫిర్యాదులను ఎన్నికల కమీషన్‌కు సమర్పిస్తామని ఆయన తెలియజేశారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్-2 సిహెచ్.సత్తిబాబు, డిఆర్ఓ యం.వి.గోవిందరాజులు రాజకీయ పార్టీల ప్రతినిధులు వై.మాలకొండయ్య (బిజేపి), రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్ఆర్‌సిపి), టి.మధు (సిపిఐ), క.కామరాజు (బిఎస్‌పి), నులుకుర్తి వెంకటేశ్వరరావు (ఐఎన్‌సి), యంసిసి, యంసియంసి అధికారులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)